# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 09-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సాంకేతికతపై విద్యార్థులు అవగాహన పెంచుకొని దానిని వృద్ధికి సాధనంగా ఉపయోగించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు.
- ❖ భారత్, సీషెల్స్ దేశాలు 7 అవగాహన ఒప్పందాలపై ఈరోజు సంతకాలు చేశాయి.
- ❖ విపక్షాల ఆందోళనలతో లోక్ సభలో ఈరోజు కూడా వాయిదాల పర్వం కొనసాగింది.
- ❖ నక్సలైట్లు తమ ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పరీక్షల సన్నద్ధత నేపథ్యంలో ఈరోజు విడుదల చేసిన “పరీక్షా పే చర్చ” 9వ ఎడిషన్ రెండవ ఎపిసోడ్ లో కోయంబత్తూర్, రాయ్‌పూర్, దేవ్‌మోగ్రా, గౌహతి విద్యార్థులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు విలువైన సూచనలను పంచుకున్నారు. విద్యార్థులకు పరీక్షలు మాత్రమే అంతిమం కాదని నైపుణ్యాలు, క్రీడలు, వ్యక్తిత్వ వికాసంపై కూడా దృష్టి పెట్టాలని ప్రేరేపించారు. విద్యార్థులు చదువును, కళలను వేర్వేరుగా చూడకూడదని ఒత్తిడి, అలసట నుండి ఉపశమనం పొందడానికి కళలపై మక్కువ పెంచుకోవాలని చెప్పారు. సాంకేతికతను ఒక శక్తివంతమైన బోధకునిగా అభివర్ణిస్తూ... విద్యార్థులు దానిపై అవగాహన కలిగి బాధ్యతతో స్వీకరించాలని, అభ్యాసం, ఆవిష్కరణ మరియు వృద్ధికి సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని, ఏ కార్యక్రమంలో నైనా ముందుండాలనే మనస్తత్వాన్ని పెంపొందించుకోవడం నాయకుడిగా ఎదగడానికి చాలా ముఖ్యమని ప్రధానమంత్రి చెప్పారు.

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సీషెల్స్ దేశం కోసం 175 మిలియన్ డాలర్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. భారత్ లో పర్యటిస్తున్న సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ లో సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం జరిగిన ఉమ్మడి మీడియా సమావేశంలో ప్రధానమంత్రి ఈ ప్రకటన చేశారు. ఈ ఆర్థిక సహాయం సీషెల్స్ లో సామాజిక గృహ నిర్మాణం, ఇ-మొబిలిటీ, వృత్తి శిక్షణ, సముద్ర భద్రతకు మద్దతునిస్తుందని చెప్పారు. వాతావరణ శాస్త్రం, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత, సుపరిపాలనతో సహా వివిధ రంగాలలో 7 అవగాహన ఒప్పందా (MoU)లపై ఇరు దేశాలు ఈ సందర్భంగా సంతకం చేశాయి. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ... ఇరు దేశాల మధ్య సంబంధాలు పరస్పర నమ్మకం, భవిష్యత్‌పై దృష్టి సారించాయని అన్నారు. ఇంధన శక్తి రంగంలో సహకారం, సుస్థిర అభివృద్ధి పట్ల తమ ఉమ్మడి నిబద్ధత నుండి ప్రేరణ పొందిందని చెప్పారు. సముద్ర తీర పొరుగు దేశాలుగా, నీలి ఆర్థిక వ్యవస్థ రెండు దేశాలు సహకరించుకోవడానికి ఒక సహజమైన రంగమని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

విపక్షాల ఆందోళనలతో లోక్ సభలో ఈరోజు కూడా వాయిదాల పర్వం కొనసాగింది. రెండు రోజుల విరామం అనంతరం లోక్‌సభ ఈ ఉదయం తిరిగి సమావేశమైనప్పుడు స్పీకర్ ఓం బిర్లా 2026 అండర్-19 ప్రపంచ కప్ గెలిచినందుకు భారత క్రికెట్ జట్టును అభినందించారు. ఆ తర్వాత ప్రశ్నోత్తరాల సమయాన్ని ప్రారంభించగా.. ప్రతిపక్ష సభ్యులు వెల్లోకి దూసుకెళ్లి నినాదాలు చేయడంతో గందరగోళం నెలకొంది. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ వారికి పలు మార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు తమ నిరసనను కొనసాగించడంతో సభ వాయిదా పడుతూనే వచ్చింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ సమావేశమైనప్పుడు, ప్రిసైడింగ్ ఆఫీసర్ 2026-27 కేంద్ర బడ్జెట్‌పై చర్చను చేపట్టడానికి ప్రయత్నించినప్పటికి.. ప్రతిపక్షాలు గందరగోళం కొనసాగించడంతో సభను రేపటికి వాయిదా వేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

కొన్ని చోట్ల ఇంకా క్రియాశీలకంగా ఉన్న నక్సలైట్లు తమ ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వారికి పూర్తి గౌరవంతో పునరావాసం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజనల్ ప్రధాన కార్యాలయం జగదల్‌పూర్‌లో ఈరోజు జరిగిన “బస్తర్ ఉత్సవ్” ముగింపు కార్యక్రమంలో ప్రసంగించిన హోం మంత్రి.. సాయుధ పోరాటం కొనసాగించే నక్సలైట్లను వదిలిపెట్టబోమని, ఆయుధాలను ఆయుధాలతోనే ఎదుర్కొంటామని హెచ్చరించారు. గిరిజనులకు భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పోరాటం కొనసాగిస్తోందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచడం వల్ల సాయుధ దళాల పోరాట పటిమ మరింత పెరుగుతుందని రక్షణ సేవల ఆర్థిక సలహాదారు రాజ్ కుమార్ అరోరా అన్నారు. ఈ కేటాయింపులతో దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి పెరుగుతుందని చెప్పారు. రక్షణ రంగానికి ఈ సంవత్సరం చేసిన బడ్జెట్ కేటాయింపుల గురించి ఆకాశవాణితో ఆయన ఈరోజు మాట్లాడుతూ... 2026 - 27 కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగానికి 7 లక్షల 85 వేల కోట్ల రూపాయలు కేటాయించారని.. ఇవి గత ఏడాదితో పోలిస్తే 16 శాతం ఎక్కువని చెప్పారు. స్థూల దేశీయోత్పత్తిలో ఇవి దాదాపు 2 శాతానికి సమానమని రాజ్ కుమార్ అరోరా వివరిస్తూ...

(వాయిస్ 17 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆయుర్వేద రంగంలో గత 50 ఏళ్లుగా ప్రజారోగ్యానికి విశేష సేవలందిస్తోందన్న జైపూర్ లోని జాతీయ ఆయుర్వేద సంస్థ (ఎన్ఐఏ) ఈ రోజు స్వర్ణోత్సవాన్ని జరుపుకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమానికి కేంద్ర ఆయుష్ శాఖా మంత్రి ప్రతాప్ రావు జాదవ్ హాజరయ్యారు. కొత్త ఓపీడీ బ్లాక్ తో పాటూ.. కీలక మౌలిక సదుపాయాలను ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు. విద్య, పరిశోధన, రోగుల సంరక్షణకు మద్దతునిచ్చేందుకు అడ్వాన్స్‌డ్ ఓటీ, సిమ్యులేషన్ ల్యాబ్‌లతో పాటు ధన్వంతరి ఉపవన్ ను కూడా ప్రారంభించారు. అనంతరం ఎన్ఐఏ జైపూర్‌లో మొదటి పాడ్ కాస్టులో పాల్గొన్న ప్రతాప్‌రావు జాదవ్... శక్తివంతమైన ఆయుష్ సంస్థల సహకారంతో భారతదేశాన్ని ప్రపంచంలో ఓ సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా మార్చాలన్నదే తమ ధ్యేయమని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ భాగంగా ముంబై వేదికగా స్కాట్లాండ్, ఇటలీ జట్ల మధ్య ఈరోజు జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ ప్రత్యర్థికి 208 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగా.. ఇటలీ 134 పరుగులకే ఆలౌట్ అయ్యింది. శ్రీలంకలోని కొలంబో వేదికగా జింబాబ్వే, ఒమన్ జట్ల మధ్య జరిగిన మరొక మ్యాచ్ లో జింబాబ్వే 8 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. ఒమన్ నిర్దేశించిన 103 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని జింబాబ్వే 13 ఓవర్లలోనే ఛేదించి గెలుపొందింది. ఇక అహ్మదాబాద్ వేదికగా దక్షిణాఫ్రికా, కెనడా జట్ల మధ్య ప్రస్తుతం మ్యాచ్ జరుగుతోంది. బ్యాటింగ్ చేస్తున్న దక్షిణాఫ్రికా 18 ఓవర్లు పూర్తయ్యే సరికి 4 వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్, లడ్డాక్, గిల్గిట్-బాల్టిస్తాన్, ముజఫరాబాద్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో రాబోయే రెండు రోజులు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఆయా ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, బీహార్, అస్సాం మేఘాలయలలో రేపు దట్టమైన పొగమంచు పరిస్థితులు నెలకొంటాయని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =